## క్లుప్తంగా

### శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీకాళికాంబ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కాళీ మాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరేష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీఅయ్యప్పస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలు, తిరుమంజన సేవ చేసి పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం గణపతి హోమం, నవగ్రహ హోమం నిర్వహించి పుణ్యాహవచనం నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి అయ్యప్పసేవా సమాజ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### లోక కల్యాణం కోసం హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అమ్మాస్ఫటిక లింగేశ్వర ఆలయంలో శుక్రవారం పాల్గున మాస పౌర్ణమిని పురస్కరించుకొని లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. యోగానంద స్వామి ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం నిర్వహించి పూర్ణాహుతి గావించారు. తర్వాత అన్నప్రసాద వితరణ చేశారు.

### దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావినూతల దుర్గాప్రసాద్ కార్యాలయంలో శుక్రవారం పేద దివ్యాంగులకు రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి బావ హనుమంతరావు జ్ఞాపకార్థం వరలక్ష్మి ఆర్థిక సహకారంతో 20 మంది వికలాంగులకు ఈ సరుకులను పంపిణీ చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. న్యాయవాదులు విశ్వనాథ్, బాలసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, చంద్రయ్యగౌడ్, సిద్దయ్య, గోపాల్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

### పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవను ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు వైభవంగా నిర్వహించారు.

### మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోళ్లు

కోవెలకుంట్ల: మార్క్‌ఫెడ్ ద్వారా పప్పుశనగ కొనుగోళ్లకు ఆదేశాలు అందినట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ క్వింటా రూ.5,650 మద్దతు ధరతో రైతులు పంట ఉత్పత్తులను విక్రయించుకోవచ్చన్నారు. రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో విక్రయ రిజిస్ట్రేషన్ చేసుకుంటే మార్క్‌ఫెడ్ ఏజెన్సీలైన డీసీఎంఎస్, పీఏసీఎస్ ద్వారా శనగ దిగుబడులను కొనుగోలు చేస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# పేదోడి ఫ్రిజ్‌లు వచ్చేశాయ్!

- మట్టికుండల్లోని నీటిని తాగేందుకు ఇష్టపడుతున్న జనం
- జోరందుకున్న కుండల విక్రయాలు



వివిధ డిజైన్లలో మట్టి పాత్రలు



నంద్యాలలో కుండల కొనుగోలు దృశ్యం

గోస్పాడు: చల్లదనానికి మట్టి కుండలు పెట్టింది పేరు. అనాదిగా వాడుకలో ఉన్న ఈ కుండల స్థానంలో అల్యూమినియం, స్టీలు, ఇతర పాత్రలు ప్రవేశం చేయడంతో వాటికి ఆదరణ తగ్గింది. అయితే, ఆధునిక (మెటల్) వంట పాత్రల వాడకం ద్వారా రోగాలు కూడా మనిషిని చుట్టుముట్టాయి. దీంతో జనం మళ్లీ మట్టి పాత్రలు, కుండల వైపు మళ్లుతున్నారు. వేసవిలో ఈ కుండల్లోని నీరు తాగితే హాయితో పాటు వేసవితాపాన్ని తీరుస్తాయి. ముఖ్యంగా ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఇటీవల కాలంలో మట్టి కుండల్లోని నీరు తాగడానికి జనం ఇష్టపడుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్‌లో కూడా రంగు రంగుల కుండలు, పాత్రలు, గ్లాసులు, జగ్గులు లభిస్తున్నాయి. ఎండాకాలం ప్రారంభం కావడంతో నంద్యాలలో వాటి విక్రయాలు జోరందుకున్నాయి. సైజ్, రకాన్ని బట్టి కుండలు, కడవలు రూ.100 నుంచి రూ.300, మగ్గులు రూ.80 నుంచి రూ.200, వాటర్ బాటిళ్లు రూ.150 నుంచి రూ.200, పెరుగు, మజ్జిగ కుండలు రూ.50 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు.

**ఫ్రిజ్ నీటితో అవస్థలే...**

ఒక పక్క ఉక్క పోత, మరో వైపు మండుటెండలు, ఇలాంటి పరిస్థితుల్లో చల్లని నీరు తాగేందుకు చాలా మంది ఫ్రిజ్‌నీటిని వాడుతుంటారు. అయితే, ఈ నీటిని తాగడం ద్వారా గొంతు నొప్పి, శ్వాస సంబంధిత రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పేదోడి ఫ్రిజ్‌గా భావించే మట్టికుండలనే వివిధ వర్గాల ప్రజలు ఆశ్రయిస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో సైతం చలివేంద్రాల్లో మట్టి కుండలనే ఏర్పాటు చేస్తున్నారు.

**కుండలోని నీరు తాగితే హాయిగా ఉంటుంది**



ఎండ వేడిమికి బయటి నుంచి ఇంటికి వచ్చాక ఫ్రిజ్‌లో ఉండే నీళ్లు తాగితే దాహం తీరడం లేదు. అదే మట్టి కుండలో ఉండే నీరు తాగితే హాయిగా ఉంటుంది. దాహం తీరినట్లు అనిపిస్తుంది. శరీరానికి ఉపశమనం ఇస్తుంది. అందుకే నేను ఇంట్లో ఫ్రిజ్ ఉన్నా మట్టికుండ ఏర్పాటు చేసుకుని అందులోని నీటినే తాగుతున్నా.

–వెంకటేశ్వరరెడ్డి, గోస్పాడు

**మట్టి పాత్రలు ఆరోగ్యానికి మేలు**



ఫ్రిజ్ నీటిని తాగడం కన్నా మట్టి పాత్రలలోని నీరు తాగడం ఆరోగ్యానికి మంచిది. ఎండాకాలంలో ప్రతి ఒక్కరికి తాగు నీరు ఎంతో అవసరం. ఎక్కువ నీరు తాగాల్సి వస్తుంది. ఫ్రిజ్లో నీటిని తాగడం వల్ల చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు పలు రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. అదే మట్టి పాత్రలలోని నీరు తాగితే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు.

–డాక్టర్ గోపాల్, ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి, గోస్పాడు

## ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి



ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తను చూపుతున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కంపుకొడుతున్న మురుగుకాల్వలను శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సీనియర్ నాయకులు తోటమద్దు అన్నారు. శుక్రవారం ప్రజా చైతన్య యాత్ర రెండో రోజు పాదయాత్రలో భాగంగా సీపీఎం నాయకులు జగజ్జననీనగర్, ఫరూక్‌నగర్, గాంధీచౌక్, నివర్తినగర్, గుడిపాటిగడ్డ, ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కాలనీల్లో కాల్వలను శుభ్రం చేయడం లేదని, రోడ్లు చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారాయని పలువురు వారి దృష్టికి తీసుకొచ్చారు. దోమలు ఇళ్లలోకి చేరి రోగాల బారిన పడుతున్నామని ఇంకొందరు వాపోయారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పట్టించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, నరసింహ, రామరాజు, వీరశేన, శివ, ఆంజనేయులు, బుజ్జి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి




ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా సెయిల్‌లో విలీనం చేసి ప్రభుత్వమే గనులను కేటాయించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో గాంధీచౌక్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్ గౌస్ హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌సంస్థకు కట్టబెట్టాలని చూస్తుందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32మంది నాడు ప్రాణాలు కోల్పోయారన్నారు. 11 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం స్టీల్‌పై ఆధారపడి ఉన్న కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం, ప్రకటనలో మాత్రం 9 వేల కోట్లు కేటాయిస్తున్నామని చెప్పి కన్నీళ్లు తుడుస్తున్నామని చెప్పడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుబ్బారావు, ఆంజనేయులు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాడుతామని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమన్న అధ్యక్షతన ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని సొంత ఇల్లు లేని పేదలు అనేక మంది ఉన్నారన్నారు. ఒక్కో ఇంట్లోనే రెండుమూడు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇప్పటికే మూడు సార్లు ఇంటి స్థలాల కోసం అర్జీలు ఇచ్చామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి హౌసింగ్ నిర్మాణానికి రూ.5 లక్షలు రుణాలు ఇవ్వాలని, లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, సుంకయ్య, శ్రీనివాసులు, హరినాథ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రజక వృత్తి దారుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏపీ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సావిత్రి

నంద్యాల(అర్బన్): రజక వృత్తి దారుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఏపీ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. రజకులకు రక్షణ చట్టం అమలు చేయాలనే దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. శుక్రవారం జిల్లా రజక సంఘీయుల సంజీవనగర్ గేటు వద్ద నుంచి రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నంద్యాల జిల్లా రజక ఐక్యవేదిక ఆధ్వర్యంలో రజక సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చైర్‌పర్సన్ సావిత్రి హాజరై మాట్లాడుతూ రజక మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు బీసీ కార్పొరేషన్ల ద్వారా కుట్టుమిషన్లు ఇప్పిస్తామన్నారు. మున్సిపాలిటీలలోని షాపింగ్ కాంప్లెక్స్‌లలో ధోబీలు స్టీమ్ ఐరన్ చేసుకునేందుకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేలా చూస్తామన్నారు. అనంతరం జిల్లా రజక ఐక్యవేదిక అధ్యక్షుడిగా సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, శ్రీనివాసులు, నాగరాజు, రామకృష్ణ, సిమెంట్ మద్దిలేటి, సీడ్స్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి క్షేత్రాన్ని కాపాడుకుందాం




మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలంలోని జ్యోతి క్షేత్రం కాపాడుకుందామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కులమతాలకు అతీతంగా దశాబ్దాల తరబడి ప్రతి రోజూ వేల మందికి అన్నప్రసాద వితరణ చేస్తూ ఆకలి తీరుస్తున్న శ్రీ కాశిరెడ్డినాయన జ్యోతి క్షేత్రం అనుమతుల విషయంలో అటవీ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కాల్వ శేషసాయి, విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## అవీ-ఇవీ

### నేడు స్వచ్ఛాంధ్ర

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో నేడు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉదయం 10.00 గంటలకు స్థాని గాంధీ సెంటరు నుంచి పాత బస్టాండ్ మీదుగా ఈద్గా వరకు స్వచ్ఛత కార్యక్రమం చేపడుతామని, ఇందులో మండలంలోని ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, పొదుపులక్ష్మీ గ్రూపుల సభ్యులు పాల్గొనాలని కోరారు.

### పేద ముస్లింలకు ఇంటి స్థలాలివ్వాలి

నంద్యాల(అర్బన్): ఎన్నికల హామీ మేరకు పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలకు 2 సెంట్ల స్థలం, పల్లెలోని వారికి 3 సెంట్ల స్థలం ఇవ్వాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ డిమాండ్ చేశారు. స్థానిక సమితి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసే అవకాశం ఉందని, వాటిని పేద ముస్లింలకు ఇవ్వాలన్నారు. బీజేపీ హిందూ, ముస్లింల మధ్య కలహాలు సృష్టించేందుకు యత్నిస్తోందన్నారు. ఇప్పటికే ముస్లింలు అభద్రత భావానికి గురవుతున్నారన్నారు. నంద్యాల బీజేపీ నాయకులు అభిరుచి మధు మాట్లాడిన మాటలు హేయమైన వన్నారు. జిల్లా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పందించి ముస్లింల మనోభావాలు గాయపరిచే విధంగా ప్రకటనలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### శ్రీశైల దేవస్థానానికి రూ.2 లక్షల విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి శుక్రవారం కర్నూలుకు చెందిన కె.సురేష్, రూ.1,00,116, హైదరాబాద్‌కు చెందిన ఆంజనేయులు రూ.1,25,000 విరాళాన్ని అందజేశారు. దాతలకు దేవస్థానం తరపున స్వామి వారి శేష వస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

### భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మ వారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అనంతరం శ్రీశైలంలోని అంకా లమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### కేసీ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం



కర్నూలు: కేసీ కెనాల్‌లో కొట్టుకుపోతున్న గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి ప్రభుత్వాసుపత్రి మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. శుక్రవారం మధ్యాహ్నం కర్నూలు వైపు నుంచి నీటిలో కింది వైపు కొట్టుకుపోతుండగా జొహరాపురం బ్రిడ్జి వద్ద స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఒకటో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటికి తీసి మార్చురీకి తరలించారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉండొచ్చని, లేత పసుపు రంగు ఫుల్ షర్టు ధరించి ఉన్నాడని, నడుముకు ఎర్రటి మొలతాడు ఉందని పోలీసులు తెలిపారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవు. మృతుడి ఆధారాలు ఏమీ లభించకపోవడంతో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారమివ్వాలని సీఐ రామయ్య నాయుడు విజ్ఞప్తి చేశారు.

## ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన అవసరం



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్):ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. ప్రధానంగా పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఏపీపీసీడీ కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల స్థానంలో జ్యూట్ బ్యాగ్‌లను వాడాలని పిలుపునిచ్చారు.

## నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, మాజీ ఎంపీ పోచా, డాక్టర్లు

గోస్పాడు: నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో శుక్రవారం నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. డాక్టర్లు నెరవాటి వినోద్ కుమార్, నెరవాటి అరుణ కుమారి ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 100 పడకల సామర్థ్యం గల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయడం సంతోషకర విషయమన్నారు. మెట్రోనగరాలకు వెళ్లాల్సిన అవసరంలేకుండా ఈఎన్‌టీ, ఇన్ఫర్టిలిటీ, గైనిక్, ఆర్థో తదితర స్పెషలైజేషన్ కలిగిన వైద్య సేవలను నంద్యాల జిల్లా ప్రజలు స్థానికంగానే పొందవచ్చునన్నారు. నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించి ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కల్లూరి రామలింగారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త నెరవాటి సత్యనారాయణ, నెరవాటి కుటుంబ సభ్యులు, డాక్టర్లు పాల్గొన్నారు.

## అట్టహాసంగా అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అహోబిలంలో గంగుల తిమ్మరెడ్డి మెమోరియల్ అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాసారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సాగిన ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, గంగుల ఫణిక్రిష్ణారెడ్డి, గంగుల భరత్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంత సంస్కృతి సంప్రదాయాల్లో ఎద్దులు ఓ భాగమని, ఈ విషయం నేటి తరానికి తెలియజేయాలని ఏటా వృషభరాజుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడూ వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండే రైతులకు ఎడ్ల పోటీలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, కేకే, నరసింహారెడ్డి తదితరులున్నారు

## ఘనంగా హోలీ పండుగ



కదిరిపురం తండాలో బంజారా పాటలకు నృత్యం చేస్తున్న గిరిజనులు

చాగలమర్రి: మండలంలో గిరిజన తండాలైన కదిరిపురం, ఓంటిగుడిసే, ముత్యాలపాడులలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్నానం ఆచరించి, తమ కుల దైవమైన సేవాలాల్ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నా పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోలీ పండుగ సంబరాల్లో మునిగి తేలారు. బంజారా పాటలకు డ్యాన్స్ చేశారు. ఈ వేడుకలో తండాలకు చెందిన సర్పంచ్‌లు లక్ష్మీబాయి, శంకరమ్మబాయి, పురప్రముఖులు గోవిందునాయక్, మొండ్యానాయక్, రాందాస్‌నాయక్, లక్ష్మమ్మబాయి, బాలానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి కారు బోల్తా



మద్దూరు మెట్ట వద్ద ప్రమాదానికి గురైన కారు

చాగలమర్రి: మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో 40వ నెంబరు జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ రాష్ట్రం అలంపూర్‌కు చెందిన ఓ కుటుంబం వెంకటేశ్వర స్వామి దర్శనానికి కారులో తిరుపతికి బయలుదేరారు. మార్గ మధ్యంలో మద్దూరు మెట్ట సమీపంలోని 40వ నెంబరు జాతీయ రహదారిపై కారు ప్రమాదవశాత్తు అదుపు తప్పి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో జయమ్మ అనే మహిళ గాయపడగా ఆమెను చికిత్స నిమిత్తం టోల్‌ప్లాజా సిబ్బంది అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చాగలమర్రి పోలీసులు సంఘటనా స్థలానికి చెరుకొని విచారణ చేపట్టారు.

## అదిగదిగో సంగమేశ్వరం!



కృష్ణాజలాల నుంచి బయల్పడుతున్న సంగమేశ్వరాలయం



ఉమామహేశ్వరాలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమేపీ తగ్గుముఖం పడుతూ 885 అడుగుల నుంచి 844 అడుగులకు చేరుకుంది. శుక్రవారం మండలంలోని సప్తనదీ సంగమ ప్రాంతంలోని కృష్ణా జలాల జాలాధివాసం నుంచి ప్రాచీన సంగమేశ్వరాలయం బయల్పడబోతుంది. దీంతో భక్తులు సంగమేశ్వరాలయం చూసేందుకు తరలివస్తున్నారు. దూరం నుంచే కృష్ణాజలాలనుంచి బయట పడుతున్న ప్రాచీన సంగమేశ్వరాలయాన్ని చూసి భక్తితో స్మరించుకొంటూ కృష్ణాజలాలో పుణ్యస్నాణాలు ఆచరిస్తున్నారు. కృష్ణానది ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయంలో శివలింగానికి, లలితాదేవి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులు వంటి విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.